జిందగీ
# చింతన

నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 29 జనవరి 2024 www.ntnews.com




త్యాగయ్య జీవిత చరిత్రను ఆయన శిష్యులు వాలాఝీపేట వేంకటరమణ భాగవతార్, కృష్ణస్వామి భాగవతార్ లోకానికి అందించారు. వీరిద్దరు తండ్రీ కొడుకులు. త్యాగయ్య జీవితం మొదటి భాగంలోని విశేషాలు తండ్రి రాయగా, రెండవ భాగంలోని విశేషాలను కుమారుడు రచించారు.

మంగళ వారం త్యాగరాజస్వామి ఆరాధన

**వేద చర్చల్లో త్యాగయ్య.. వ్యాసుడంతటి వాడు. మృదుమధుర వాక్యరచనలో వాల్మీకి సమానుడు. వైరాగ్యంలో శ్రీశుకుని సరిసాటి. భక్తిలో ప్రహ్లాదుడంతటి మేటి. సాహితీసృష్టిలో పుంభావ సరస్వతి. సంగీత సాధనలో నారద సమానుడు. రామ నామ రసాస్వాదనలో పరమశివుడికే పోటీ! కర్ణాటక సంగీత స్వరకర్తగా, నిరంతర గానలోలునిగా, నాదజీవిగా ఆ'కృతి' దాల్చిన సంగీత స్వరూపం త్యాగరాజస్వామి. నిధి కన్నా.. రాముని సన్నిధి సుఖమని తరించిన వాగ్గేయకారుడి అమృత జీవనం.. నిజమైన భక్తికి పరమపద సోపానం.**

# సంగీత జ్ఞానం.. రామయ్య ధ్యానం..

**అనాదిగా** వ్యక్తి వికాసంలో సంగీత, సాహిత్యాలు శిఖ రాయమానంగా నిలిచాయి. తెలుగు సాహిత్యానికి కవి త్రయం, పోతన, శ్రీనాథుడు తదితర కవులు నిర్దుష్టమైన సంప్రదాయాన్ని చూపించారు. సంగీత సామ్రాజ్యానికి ఉన్నతమైన సంప్రదాయ మార్గాన్ని చూపించి, సంపూర్ణ వికాసదీప్తిని కలిగించిన ద్రష్ట త్యాగయ్య. యుగయుగా లుగా, తరతరాలుగా భరతజాతికి ఆదర్శ దైవమైన శ్రీరా మచంద్రుడిని త్రికరణ శుద్ధిగా తన హృదయంలో ప్రతి ష్ఠించుకొని, తన జీవితాన్ని ధన్యం చేసుకున్న నాదోపాస కుడు ఆయన. శొంఠి వేంకట రమణయ్య దగ్గర శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందిన త్యాగరాజస్వామి తన జీవి తకాలంలో సుమారు 24,000 కృతులను రచించారని చెబుతారు. అయితే, కేవలం 600 మాత్రమే అందుబా టులో ఉన్నాయి. వాటిని 'త్యాగోప నిషత్తులు'గా అభివర్ణిస్తారు. ఆ కృతులను భావన చేయగలిగిన వారికి అవి ఉపనిషత్తులతో సమా నమైన జ్ఞాన వాహినులుగా మదిలో మెదులుతాయంటారు.



**భాషకు** అతీతమైన అతీంద్రియ శక్తి సంగీతానికి ఉంటుంది. ఆ సంగీత సాధనే నాదోపాసన. ఆ నాదోపాసనే ప్రణవోపాసన. నాదోపాస నతో అంతర్గత శ్వాసలో మార్పులు జరుగుతాయి. అది ప్రాణాయామంతో సమానమని యోగ శాస్త్రజ్ఞులు చెబు తారు. 'వరవీణా వాదన తత్వజ్ఞుని..'గా త్యాగరాజు నుతించిన నారదుడే స్వయంగా ఈ వాగ్గేయకారుడికి సంగీత రహస్యాలను బోధించి, 'స్వరార్ణవ' అనే గ్రంథాన్ని బహూకరించాడని ప్రతీతి.

**త్యాగరాజు** ప్రతీ కృతి రామ స్తుతే. ఆయన చేసిన ప్రతీ గానం.. రామామృతమే! వాల్మీకాదులు రామాయణాన్ని రచించి తరిం చారు... మరి ఆ కథను వర్ణిం చాలన్న తన ఆశ ఎలా తీరుతుం దనే ప్రశ్నకు బదులు 'మునులు, నరులు, నిను వర్ణించిన నా యాస దీరునా, మేల్మియై యుండు సద్భక్తులు మెచ్చు దురే త్యాగరాజ నుత' కీర్తన. నవ్వుతూ పలకరించడం.. ముందుగా తానే పలకరించడం రాముడి లక్షణం! అందుకే 'ఏమని మాట్లాడితివో రామ.. ఎవరి మనసుకే విధమో దెలిసి..' అని మరో కీర్తనలో రామ య్యను పొగుడుతారు. 'వెడలెను కోదండపాణి అనుజ సౌమిత్రితో గూడి.. పుడమిలో జనులెల్ల పొగడ.. పూజితుడౌ మునితో గూడి' అని రాఘవుడి అవతార ప్రయోజనాన్ని విశదీకరించారు. 'శ్రీరామ పాదమా నీ కృప చాలునే చిత్తానికి రావే' అని అహల్యా శాప విమోచన ఘట్టాన్ని ఆవిష్కరించారు. 'తెలి యలేరు రామభక్తి మార్గమును.. ఇలనంతట తిరుగు చును కలవరించెదరు గాని... తెలియలేరు వేగలేచి నీట మునిగి బూదిపూసి వేళ్లనెంచి శ్లాఘనీయులై బాగ పైకమా ర్జనులునైరే గాని.. త్యాగరాజ వినుత తెలియలేరు రామ భక్తి మార్గమును' అనే కృతితో సంఘంలోని కుసంస్కారా లను ఎత్తిచూపారు.

## ధన్యజీవి

త్రిలోకాలతో అవిచ్ఛిన్నమైన అనుసంధా నాన్ని కలిగి ఉండటం భారతీయ చింతనలో ఒక విలక్షణమైన స్థితి. సర్వవ్యాప్తమైన చైతన్యానికి అనుసంధానమైనప్పుడు భౌతిక జీవనంలో పరిమిత మనసు త్రిగుణాలకు అతీతమై ఆనందానుభవాన్ని పొందుతుంది. ఆ స్థితిని సంగీత సాధనలో సాధించినవారు త్యాగయ్య. సంగీతంలో తన్మయత్వాన్ని పొంది, అరవిందులు పేర్కొన్న ఉన్నత మనసు, ప్రదీప్త మనసు, ప్రబుద్ధ మనసు, అతీత మనసులనే సోపానాలను అధిగమించి భగవత్ దర్శనం పొందిన మహోన్నత వ్యక్తి ఆయన. మనోపరిమితు లకు, దేశకాల పరిధులకు అతీతంగా తాను చేస్తున్న నాదసాధనా ధ్యానంలో తరించిన ధన్యజీవి త్యాగరాజు.

**తండ్రి** దగ్గర రామతారక మంత్ర ఉపదేశం పొందిన త్యాగయ్య దాదాపుగా 20 ఏండ్లపాటు జప సాధన చేశారు. ఆ సమయంలో ఆయనకు రామ దర్శనం అయిందని.. అలా దర్శించిన శ్రీరాముని చూస్తూ ఆనం దంతో.. అప్రయత్నంగా 'బాలకనకమయ చేల...' అన్న కృతితో రాముణ్ని కీర్తించారని తెలుస్తున్నది. సుమారు 96 కోట్ల రామనామం జపించారని, రామకథామృతాన్ని రాగ తాళ సమన్వయంతో పాడుకుంటూ తన్మయుడై తరించా రని చెబుతారు.

**తంజావూరు** రాజు ధన, కనక, వస్తు, వాహనాది సంపదలు పంపి రాజసభకు రావాలని ఆహ్వానించగా త్యాగరాజు 'నిధి చాల సుఖమో రాముని సన్నిధి సేవ సుఖమో నిజముగ బల్కు మనసా' అంటూ శ్రీరాముని చరణ సన్నిధే తనకు పెన్నిధి అని చాటిచెప్పారు. తన జీవిత చరమాంకంలో సన్యాసాశ్రమాన్ని స్వీకరించిన త్యాగయ్య 80 ఏండ్లకు పైగా జీవించి, తన ఆరాధ్య దైవ మైన శ్రీరాముడిలో ఐక్యమయ్యారు. 'ఎందరో మహాను భావులు అందరికీ వందనములు..' అని పలికిన నిగర్వి, సిద్ధపురుషుడైన త్యాగయ్య నామస్మరణం రామాంకితం అవుతుంది.

... పాలకుర్తి రామమూర్తి

## రెండాకులు

కథాసుధ

**ఒక** ఉపాధ్యాయుడికి మరో ఊరికి బదిలీ అవుతుంది. కుటుం బంతో కొత్త ఊరికి చేరుకుంటాడు. తన పన్నెండేండ్ల కూతురును అదే పాఠశాలలో చేర్పించాడు. ఇంటికి వచ్చాక కూతురుతో 'కొత్త బడి ఎలా ఉంది తల్లి?' అని అడిగాడు తండ్రి. అమ్మాయి బాధగా 'పిల్లలంతా తలోరకం ఉన్నారు నాన్న! వారితో ఎలా సర్దుకుపో వాలో తెలియడం లేద'ని వాపోయింది. తండ్రి చిన్నగా నవ్వి.. 'ఎలా సర్దుకుపోవాలో కిటుకు చెబు తాను. పెరట్లో మామిడిచెట్టు నుంచి రెండు ఆకులు కోసుకొని రా! అయితే రెండు ఆకులూ ఒకేలా ఉండాలి' అని చెప్పాడు. అమ్మా యికి అందేంత ఎత్తులోనే చాలా ఆకులు ఉన్నాయి. కానీ, ఆకులన్నీ ఒకే పోలికతో ఉన్నా... సూక్ష్మంగా చూస్తే వేటికవే ప్రత్యేకంగా కని పించాయి. గంటసేపు చూసినా పూర్తిగా ఒకేలా ఉన్న రెండు ఆకులను కనిపెట్టలేక ఉస్సూరుమంటూ తండ్రి దగ్గరికి వచ్చి విషయం చెప్పింది. తండ్రి నవ్వుతూ.. 'మన ఇంటి మామిడి చెట్టులోనే కాదు, వేలాది వృక్షాలున్న అడవిలో వెతికినా ఏ రెండు ఆకులూ అచ్చుగుద్దినట్టు ఒకేలా ఉండవు. అది దైవలీల. మనుషులు కూడా అంతే! రూపంలో కానీ, గుణంలో కానీ, నడవడికలో కానీ ఒకరు ఉన్నట్లు మరొకరు ఉండరు. 'లోకోభిన్న రుచిః' అని తెలి సిందే కదా! ఒక్కొక్కరూ ఒక్కో విధంగా ఉంటారని, వారు వారిలా గానే ఉంటారని తెలుసుకుంటే చాలు. ఓపికగా, చిన్నచిన్న సర్దు బాట్లు చేసుకుంటూ, చిరునవ్వుతో ముందుకుసాగితే... కలిసి చద వడం సులభమవుతుంది' అని వివరించాడు. కిటుకు తెలుసుకున్న అమ్మాయి మర్నాడు ఉత్సాహంగా బడికి బయల్దేరింది.



... ఆర్.సి.కృష్ణస్వామి రాజు,
93936 62821

## దుర్మార్గుడికి దుర్గతి

ఇస్లాం బోధ

**వేల** సంవత్సరాల కిందట ఈజిప్టును ఫిరౌన్ అనే చక్రవర్తి పాలించేవాడు. దుర్మార్గమైన విధానాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవాడు. ఆ నియంత పాలనలో ప్రజలకు దినదిన గండంగా గడిచేది. రాజ్యంలో తనను ప్రశ్నించే వాడు ఉండకూడదని భావించాడు ఫిరౌన్. పిల్లలు పెద్దవారైతే తన రాచరికాన్ని ప్రశ్నిస్తారని అనుమానంతో... మగబిడ్డ పుడితే వెంటనే చంపేయమని సైనికులను ఆదేశించాడు. గర్భిణులపై నిఘాపెట్టి ఉంచేవారు సైనికులు. మగపిల్లాడు పుడితే హతమార్చేవారు. అయితే, ఒక ఇల్లాలికి పండంటి మగబిడ్డ పుడతాడు. సైనికుల కండ్లు గప్పి మూడునెలలు బిడ్డను కాపాడుకొచ్చింది. బిడ్డ ఇంకా అక్కడే ఉంటే ప్రమాదమని దైవంపై భారం వేసి ఓ సాహసానికి పూనుకుంది. పసివా డిని బుట్టలో పెట్టి నైలు నదిలో వదిలిపె ట్టింది. నదీజలాలపై తేలియాడుతూ చాలా దూరం ప్రయాణించిన బుట్ట.. రాజభవనం ఆవరణలోని తోటలో తీరానికి చేరుకుంది. ఆ బుట్టను గమనించిన సేవకులు అందులో శిశువును మహారాణికి అప్పగించారు. ఆ బాలుణ్ని చూడగానే రాణి మనసు ఉప్పొంగింది. శిశువు ఆలనాపాలనా చూసుకునే అవకాశం యాదృచ్ఛికంగా ఆ బాలుడి సొంత తల్లికే దక్కింది. ఆ పిల్లవాడు పెరిగి పెద్దయ్యాక ప్రవక్త మూసాగా ప్రసిద్ధి చెందాడు. ఫిరౌన్ చక్రవర్తి దుర్మార్గాలకు ఎదురుతిరిగాడు. వేలమంది సైన్యంతో తనపై దాడికి వచ్చిన ఫిరౌ న్‌ను ప్రవక్త మూసా సముద్రంలో ముంచేశాడు. ప్రజలను ఈతిబాధ లకు గురిచేసిన ఫిరౌన్ అల్లాహ్ శిక్షకు గురయ్యాడు. ఫిరౌన్ భార్య ఆసియాను అల్లాహ్ ఎంతో మెచ్చుకున్నాడు.



... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

ఉపనిషత్ సారం

## దేవుడు ఇచ్చిందనుకో!

**'వాయుర్వావ** సంవర్గో' వాయువే చిట్టచివరి ఆశ్రయం. సంవర్గం అంటే అన్నిటినీ తనలో విలీనం చేసుకోవడం. ఛాందోగ్య ఉపనిషత్తులో కింది వృత్తాంతం కనిపిస్తుంది. మహావృష రాజ్యాన్ని పాలించే జానశ్రుతి మహారాజు ఎన్నో అన్నదానాలు చేశాడు. అతనికి తనంతవాడు లేడనే అహం! ఒకనాడు మేడమీద విశ్రమిస్తుంటే రెండు హంసలు ఎగురుతూ మాట్లాడుకుంటున్నాయి. ఒక హంస 'జానశ్రుతి వంటి ధర్మరాజు లేడు' అన్నది. మరో హంస నవ్వి 'బండి తోలుకునే రైక్వుడు లేడా! జానశ్రుతి ధర్మకార్యాలన్నీ కీర్తి కోసమే కదా!' అన్నది. హంసల మాటలు విన్న రాజు చిన్నబో యాడు. మర్నాడు రైక్వుడిని వెతికి తెమ్మని ఒక భటుణ్ని పంపాడు. దొరకలేదని తిరిగి వచ్చిన భటు డితో 'యోగులుండే ప్రదేశాల్లో వెతకమ'ని కసిరాడు జానశ్రుతి. మొత్తానికి ఒక మారుమూల పల్లెలో రైక్వుడు కనిపించాడు. అతని దర్శనార్థం రాజు పరి వారంతో వెళ్లాడు. వెంట ఎన్నో కానుకలు తీసుకె ళ్లాడు. ప్రశాంతంగా ఉన్న రైక్వునికి నమస్కరించాడు రాజు. కానుకలు తీసుకోమన్నాడు. 'వీటితో ఆత్మజ్ఞా నాన్ని కొందామనుకున్నావా రాజా! అది అమ్ముడు పోయేది కాదు' అన్నాడు రైక్వుడు. మారుమాట్లాడక రాజు రాజధానికి వెళ్లిపోయాడు. కొన్నాళ్లకు రాజుకు మళ్లీ రైక్వుడిని చూడాలనిపించింది. ఈసారి నిరా డంబరంగా ఒక్కడే వెళ్లాడు. ఆత్మజ్ఞానం గ్రహించ డానికి రాజు అర్హుడని భావించిన రైక్వుడు అతనికి 'సంవర్గ విద్య'ను అనుగ్రహిస్తూ.. 'దానాలు చేయి. కానీ, గర్వపడకు. నా ప్రయోజకత్వమే అనుకోకు. అది అహం.. నాశనం చేస్తుంది. కీర్తి కాంక్షతో దానం చేయకు. పరమాత్ముడు నాకు అందించిందే దానం చేస్తున్నా అనుకో. అది నీ కర్తవ్యంగా భావించు. ఆత్మానుభూతి లభిస్తుంది' అని ఉపదే శించాడు. రాజు ఎంతో ఆనందించాడు. బంగారు నాణేలతో, రథాలతోపాటు తన కుమార్తెను భార్యగా స్వీకరించాల్సిందిగా రైక్వుడిని ప్రార్థించాడు. దానికి ఆయన ఒప్పుకొన్నాడు. అతను నివాసమున్న పల్లె 'రైక్వపర్ణ'మని ప్రసిద్ధి చెందింది.

.. డా|| వెలుదండ సత్యనారాయణ


# పోతపోసిన భక్తి కైత - మన పోతన!

**శు**కుడు పరీక్షిత్తుతో.. భూవరా! కారాగృహంలో ప్రకట మైన ఆ పిల్లవాడు ధారాధర దేహుడు- నల్లని మబ్బుల నిగారింపుల దేహంతో పురిటిల్లు ఉల్లసిల్ల (ఆనందింప) చేస్తున్నాడు. ఆజాను చతుర్బాహుడు- మోకాళ్ల వరకు పొడవైన అతని నాలుగు చేతులలో శంఖ, చక్ర, గద, అరవిందాలు కనువిందుగా వెలుగొందుతున్నాయి. అతడు సరసీరుహాక్షుడు- శతపత్రా (పద్మా)ల వంటి అందాల నేత్రాలు కలవాడు. అతని వక్షఃస్థలం విశాలం. కంఠంలో కౌస్తు భరత్నం వింత కాంతులను వెలువరిస్తున్నది. కమనీయమైన కటిసూత్రం- మొలతాడు, కంకణాలు, భుజకీర్తులతో గాత్రం రమణీయంగా ఉంది. ఇమ్ముగ శ్రీవత్సమనే మచ్చ రూపంగా ఇల్లాలు లచ్చి (ఇందిర)కి నెలవైన రొమ్ము కలవాడు. కుండ లాల కాంతులతో నుదుటి (లలాటం) మీది ఉంగరాల వంటి ముంగురులు రంగులీనుతున్నాయి. మకుటం (కిరీటం)లోని వైడూర్యమణుల నిగనిగలు వగలు పోతున్నాయి.

తే|| 'బాలుఁబూర్ణేందు రుచిజాలు భక్తలోక
పాలు సుగుణాలవాలుఁ గృపావిశాలుఁ
జూచి తిలకించి పులకించి చోద్య మంది
యుబ్బి చెలరేగి వసుదేవుడుత్సహించె!'

రాజా! ఆ కన్నవాడు చిన్నవాడుగా ఉన్నా ఈ అన్ని దివ్య లక్ష ణాలతో పున్నమి చంద్రుని కన్నా మిన్నగా కమ్మని కాంతులను విరజిమ్ముతున్నాడు. అతడు భక్త లోకపాలుడు- భక్తులను కాచి కడతేర్చువాడు. సుగుణాలవాలుడు- సమస్త కల్యాణ గుణా లకు కాణాచి (నిధి). కృపావిశాలుడు- అపారమైన కరుణ కల వాడు. అదృశ్యుడు దృశ్యుడయ్యాడు- సత్ పాత్రులకు నేత్ర గోచరుడయ్యాడు. నిర్గుణ నిరాకారుడు భక్తుల ప్రేమకు వశపడి నరాకారుడయ్యాడు. శిశురూపంలో సగుణ సాకారమయ్యాడు! మిన్ను, మన్ను- అంతటా ఉన్న సంపన్నుడైనా, కన్నవారికి చిన్నారి చిలిపి కన్నయ్య అయ్యాడు! 'పితాహ మస్య జగతః మాతాధాతా పితామహః' (గీత)- ఈ జగత్తుకే తండ్రి, తల్లి, మాత, ధాత (రక్షకుడు) అయినవాడు ఇప్పుడు ఒక తల్లికి, తండ్రికి తనయుడు అయ్యాడు. 'తాను అగుణు (గుణరహితు) డైనా తన భక్త గణాలను గుణాతీతులుగా చేయడానికి.. తాను అజాయమానుడు (జన్మలేనివాడు) అయినా, ఇలా త్రిగుణ ప్రకృతితో కూడిన మాయా సహాయంతో పురుషుడుగా పుట్టాడు. ఇంకా విచిత్రం, విరుద్ధమేమంటే- లోకంలో జీవు లందరూ ముందుగా శుభాశుభ (పుణ్యపాప) కర్మలు చేసి వాటి ఫలాలను (సుఖదుఃఖాలను) తరువాత అనుభవిస్తారు. ఇందుకు విలక్షణంగా లోకసాక్షి అయిన సరసీరుహాక్షుడు కృష్ణుడు కారాగార శిక్షను మున్నుగానే- జన్మించిన తక్షణమే అనుభవించి తర్వాత ఎప్పటికో దొంగతనం చేసి వెన్నను భక్షిం చాడు!'- అని దత్తగురుని 'శ్రీకృష్ణ భాగవతం'.

శుకుడు- రాజా! ఈ తీరున ఉన్న ఆ అద్భుత బాలకుని ముందు తేరిపార తిలకించి, తరువాత పరిపరి విధాల పరికించి వసుదేవుడు పులకించిపోయాడు. అబ్బురపాటుతో ఉబ్బితబ్బి బ్బయ్యాడు. ఉల్లాసంతో ఉప్పొంగాడు. ఆ పారవశ్యం నుంచి ఎప్పటికో తేరుకొని కారాగృహంలో ఎంతో ఉత్సహించాడు. 'త



మద్భుతం బాలకం... వసుదేవ ఐక్షత' (అద్భుతమైన ఆ పసి బాలుని వసుదేవుడు చూచాడు) అని మాత్రమే మూలం. కాని, 'పోత పోసిన భక్తి కైత (కవిత)' మన పోతన తానే ఆనక దుందుభై- వసుదేవుడై, తన మానసంలో భ్రాజమానుడై (వె లుగుతూ) ఉండే ఆ 'ఆజాను చతుర్బాహు'ని కని తాను అనుభ వించిన ఆనందానుభూతిని అంత్యప్రాసల చిరుగజ్జెల సవ్వడుల జాను తెనుగులో ఉత్సాహం పూని ఇలా... 'చూచి, తిలకించి, పులకించి, చోద్యమంది, ఉబ్బి చెలరేగి' అని అభివర్ణించాడు.

బాలక జన్మవార్త వినగానే జనకుడు కాలయాపన చేయక సచేల స్నానం చెయ్యాలి. కాని, జలస్నానం వీలుపడక వసుదేవుడు ఆనందరసం కల జలనిధిలో మునిగితేలాడు. ధరామరులకు- వైదిక బ్రాహ్మణులకు పదివేల ఆవులను దానమిస్తానని కారాగృ హంలో ధారపోశాడు. పురిటింటికి ప్రదీపమై పాపని రూపంలో వెలుగొందు కంజలోచనుని పదకంజా లకు భక్తితో అంజలి ఘటించాడు. ఇలా ప్రస్తుతిం చాడు...



మన పోతన మధురిమ 158వ భాగం

కం|| 'ఏ నిన్ను నఖిలదర్శను
జ్ఞానానంద స్వరూపు సంతతు నపరా
ధీనుని మాయా దూరుని
సూనునిగాఁ గంటి, నిట్టి చోద్యము గలదే?'


స్వామీ! నీవు సమస్త సృష్టినీ నీ యందే చూపిస్తావు. లోకులంద రికీ నీ సృష్టి మీదే దృష్టి. కానీ, స్రష్టవైన నీయందు దృష్టి పెట్టే అదృష్టవంతులు చాలా అరుదు. మట్టికుండలోను, బంగారు దండలోను... మట్టి, బంగారం కానరావడం లేదన్న వానికి, వాటి వాస్తవ స్వరూపం తెలియనట్లే గదా! జ్ఞానం, ఆనందం ఒక్కటై నీ రూపుదిద్దుకున్నాయి. నీవు నిత్యుడవు, ప్రకృతికి పరు (అతీతు)డవైన దేవదేవుడవు. మాయ నిన్నుముట్టక దూరంగా తొలగిపోతుంది. అట్టి 'మాయాదూరు'ని నిన్ను నేను సూను నిగా (కుమారునిగా) కన్నానట! ఇట్టి విడ్డూరం ఎక్కడైనా ఉంటుందా? కన్నతండ్రీ! నృశంసుడు (క్రూరుడు) కంసుడు, నీవే వారి రూపంలో పుట్టావనే కంపం (వణుకు)తో నీ అన్న లందరినీ చంపివేశాడు. పుట్టావని తెలియగానే నిన్ను కూడా మట్టుబెట్టాలనే పట్టుదలతో వాడున్నాడు'. యాదవులలో దేవకీ వసుదేవులకు మాత్రమే మాధవుని చతుర్భుజ రూపం దర్శించే మహద్భాగ్యం' కలిగింది! దేవకి కూడా ఇలా ప్రార్థించింది... ఆదిదేవా! అసాధ్యమైన నీ చతుర్భుజ రూపాన్ని నా ఈ చర్మచ క్షువులతో చూడగలిగాను. ఈ అసాధారణ రూపాన్ని ఉపసంహ రించుకొని లౌకికమైన పసిరూపాన్ని నాకు ప్రసాదించు. నీకు ప్రణమిల్లుతా.

ఆ|| 'విలయకాలమందు విశ్వంబు నీ పెద్ద
కడుపులో దాఁచు కడిమి మేటి
నటుఁడ వీవు, నేడు నా గర్భజుఁడ వౌట
పరమ పురుష! వేడబంబు గాదె!'

పురుషోత్తమా! ప్రళయంలో ఈ ప్రపంచాన్నంతా నీ పెద్ద పొట్టలో దాచుకోగల సమర్థుడవైన మేటి నటుడవు. అట్టి నీవు నా కడుపున పుట్టడం ఒడుపైన (పట్టుతో కూడిన దట్టమైన) నీ మాయగాక మరేమిటి పట్టీ (బిడ్డా)! దుష్టుడైన ఈ కంసుని శిక్షించి నీకు ఇష్టులమూ, శిష్టులమూ అయిన మా కష్టాలను పోగొట్టి మమ్ము రక్షించు' అనగా.. అప్పుడు పరమాత్మ వారి పూర్వజన్మల వృత్తాంతం, తన అవతార విశేషం వివరించాడు.

ఈ దేవకీ వసుదేవులే గత జన్మలో వృష్ణి, సుతపులు. వారి తపస్సుకు ప్రసన్నుడై పరమాత్మ వారికి 'వృష్ణిగ ర్భుడు'గా ప్రాదుర్భవించాడు. మరుసటి జన్మలో వారే అదితి కశ్యపులు. విష్ణువు వారియందు 'వా మన' నామంతో ఆవిర్భవించాడు. జగన్నాథుడు దేవకీ వసుదేవులతో... జననీ జనకులారా! ఇక మీకు గానీ, మీ వలన నాకు గానీ మరి జన్మలే దని పలికి, మీరు నన్ను పుత్రభావంతోను, పర బ్రహ్మ భావంతోను భావిస్తూ నా పరమపదం పొందుతారని తెలిపాడు. కాన, దేవకీ వసుదేవుల భక్తి మిశ్రమ భక్తి. నందయశోదల భక్తి శుద్ధ వాత్సల్యమయం.

శుకయోగి- రాజా! అలా పలికి ఉపేంద్రుడు తన చతుర్భుజ రూపాన్ని ఉపసంహరించాడు. మార జనకుడు- హరి సుకుమా రమైన పసిబాలుని రూపంలోకి మారిపోయాడు. అప్పుడు వసుదేవుడు విసుమానం (ఆశ్చర్యం) వహించి వాసుదేవుని వలన తన తక్షణ కర్తవ్యం గ్రహించాడు. పసిబిడ్డను అడ్డంగా రొమ్ముకు హత్తుకొని, చప్పుడు కాకుండా తప్పటడుగులతో పురిటింటి నుంచి నెమ్మదిగా బయటపడ్డాడు. కాళ్లు చేతుల సంకెళ్లు విడిపోగా తాళాల కీళ్లు ఊడి పడిపోయాయి. ద్వారాలు తమంత తామే తెరుచుకున్నాయి. పాపని మాయకు లోనై కాప లావాళ్లు కూడా గమ్మత్తుగా మత్తులోకి జారుకున్నారు. వసుదే వుడు శిశువున్న గంపను శిరస్సు పైకి ఎత్తుకోగానే సకల బంధాలు చిత్తయిపోయాయి. ముకుందుని నెత్తిన- బుద్ధిలో ధరించువారికి కారాగార ద్వారాలేమిటి? ముక్తిద్వా రాలు కూడా తెరుచుకొం టాయి గదా! ఆదిశేషుడు పడ గలు విప్పి ఆ పిల్లవానికి గొడుగులాగా పట్టి రక్షిస్తూ కదిలాడు. అడ్డమొచ్చిన యమునా నది ఉధృత ప్రవాహం కూడా ఉపశమిం చింది- శాంతించింది. పూర్వం త్రేతాయుగంలో సీతాపతి రామచంద్రునికి సముద్రం సేతురూపంగా మార్గమి చ్చినట్టు, కాళింది (యమున) కూడా వసుదేవునికి (కాగల భర్త అయిన కృష్ణచంద్రునికి) దారి ఇచ్చింది. ఆయన మైకంలో జోగుతున్న వ్రేపల్లె చేరి, మైమరచి నిద్రిస్తున్న యశోద పాను పుపై కన్నయ్యను ఉంచి, కన్నెపిల్ల (యోగమాయ)ను ఎత్తుకొని వచ్చి తన కాంత పక్కలో శాంతంగా, చక్కగా పడుకోబెట్టాడు.



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

(సశేషం)